క్లుప్తంగా

రికార్డులు పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ, ఏఈఓలు

ముదిగొండ: మండలంలోని ముదిగొండ సహకార సొసైటీలోని ఎరువులకు సంబంధించిన రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను వ్యవసాయశాఖ అధికారిణి సరిత శుక్రవారం పరిశీలించారు. సొసైటీలోని నిల్వ ఉన్న యూరియా నిల్వలను పరిశీలించి, రైతులకు సరిపడా యూరియా ఉందన్నారు. దుకాణాదారులు అధిక ధరలకు విక్రయిస్తే సీజ్ చేస్తామన్నారు. కొనుగోలు చేసిన రైతులు రసీదులు పొందాలని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ యలగొండస్వామి, సీఈఓ వెంకటరత్నం, ఏఈఓ మౌనిక ఉన్నారు.

కోదండ రామాలయంలో కుంకుమ పూజలు

వైరా: శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా వైరాలోని కోదండరామాలయంలో వైరా వాసవీ వనిత కిట్టి సభ్యుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కొదుమూరి భాగ్యలక్ష్మి, బొగ్గవరపు సునీత, వాసవి వనిత కిట్టీ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లికి విశేష అలంకరణ

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ముత్యాలమ్మ తల్లికి విశేష అలంకరణ చేశారు. అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో మహిళలు హాజరై అమ్మవారికి పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

మండల ఏపీఎంగా శ్యాంకుమార్



శ్యాంకుమార్

ఏన్కూరు: మండల సెర్ప్ ఏపీఎంగా కందుకూరి శ్యామ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన వెంకట రామారావు కామేపల్లికి బదిలీ కాగా.. అక్కడ ఏపీఎంగా పని చేస్తున్న శ్యామ్‌కుమార్ ఇక్కడికు వచ్చారు.

సింగరేణికి బకాయిలు చెల్లించాలి

సత్తుపల్లిరూరల్: సింగరేణికి ప్రభుత్వ రంగ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్, నాయకుడు టీఎస్.పవన్‌కుమార్ కోరారు. సత్తుపల్లి సీహెచ్‌పీ వద్ద శుక్రవారం సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘం పిట్ సెక్రటరీ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు జి.వెంకట్‌రెడ్డి, జీ.వీ.కృష్ణారెడ్డి, రవి, గణేష్, నాగేశ్వరరావు, శ్యాంప్రసాద్, ఉదయ్ భాస్కర్, చారి, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

తల్లాడ: ఈ నెల 5 నుంచి కల్లూరు ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో జరగనున్న అండర్ 16 క్రికెట్ ట్రోఫీ పోటీల పోస్టర్లను తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. ఒకే పాఠశాలకు చెందిన విద్యార్థులు టీమ్‌గా పాల్గొనాలి. ఈ నెల 2తో ఎంట్రీ ముగియనందున.. విద్యార్థులు వైట్, స్కూల్ యూనిఫాంతో ఆడవచ్చని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రైయినీ ఎస్‌ఐ బి.వెంకటేష్, హెడ్‌కానిస్టేబుల్ చెన్నారావు, వెంకట్, మురళీకృష్ణ, ఆర్గనైజర్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు గానూ ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి రూ.9లక్షల నిధులు మంజూరు చేశారు. ఈనిధులతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్లకు శుక్రవారం డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ కోటా రాంబాబు శంకుస్థాపన చేశారు. మాజీ సర్పంచ్ పురుషోత్తం రాజు, నాయకులు రమేష్, కాంతారావు, చెన్న కేశవరావు, రత్నబాబు తదితరులున్నారు.

ఆర్థిక సాయం

ముదిగొండ: మండలంలోని వల్లబి గ్రామానికి చెందిన పేదింటి విద్యార్థిని దరిపల్లి పుల్లయ్య, జానకిల కుమార్తె అనుషాకు ఉన్నత చదువులకు ముదిగొండ సహకారసొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి ముదిగొండ కార్యాలయంలో శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. బీటెక్‌లో 40వేలు ర్యాంక్ రావడంతో స్తోమత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినిని చూసి చలించిన యలగొండ స్వామి మానవతా దృక్పదంతో తనవంతుగా రూ.22వేల నగదును అందించారు.

రాకేష్ కుటుంబానికి..

తల్లాడ: తల్లాడకు చెందిన గుండ్ల రాకేష్ కుటుంబానికి పోట్రు లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకుడు పోట్రు ప్రవీణ్ రూ.15వేలు ఆర్థిక సాయం అందించి.. రాకేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌లాల్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం..

- 'సీజనల్స్' ప్రబలకుండా అధికారుల ముందస్తు జాగ్రత్తలు
- గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు
- ఊరూరా ప్రజలకు అవగాహన



వందనంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతకాని: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. ప్రజలు అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉంటే అంటు వ్యాధులు, విషజ్వరాల నుంచి రక్షణ పొందవచ్చు. ఈ సీజన్‌లో ఎక్కువగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. వర్షపు నీరు నిలిచి మురుగు గుంటలుగా మారి వాటిలో దోమలు వృద్ధి చెందుతాయి. సైడ్ కాలువలు, పాతబడిన కూలర్లు, టైర్లలో నిల్వ ఉన్న నీటిలో, నివాస ప్రాంతాల సమీపంలోని రోళ్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాల్లో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది.

అవగాహన అవసరం..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారినుండి తప్పించుకోవచ్చు. గత మూడేళ్ల నుంచి వర్షాకాల సీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారినపడ్డారు. వర్షాకాలంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే కొంత మేరకైనా ప్రజలు అవగాహన కలిగి ఉంటారు.

అపరిశుభ్రతతో ఇక్కట్లు..

ప్రతి వర్షాకాల సీజన్ ప్రారంభంలో అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించి పారిశుద్ధ్య పనులపై హడావుడి చేయడమే తప్ప గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నివారణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించి అపరిశుభ్రత తాండవిస్తోంది. గ్రామ పంచాయతీ పత్యేకాధికారులు గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సైడ్ కాలువల్లో చెత్తను తీసివేయించి మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి.
- అనంతరం కాలువల వెంబడి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- ఇంటి ఆవరణలో ఉన్నటువంటి కొబ్బరిబొండాలు, పాత టైర్లు, కూలర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలి.
- గ్రామాల్లో కొబ్బరిబొండాల వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు మిగిలిన చెత్తను గ్రామ పరిసరాల్లో పోయకుండా తగలబెట్టేలా చర్యలు తీసుకోవాలి.
- దోమల నివారణకు మందును పిచికారీ చేయించాలి. తాగునీరు కలుషితం కాకుండా చూసుకుంటూ రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ తీరుపై అప్రమత్తంగా ఉండాలి.
- అంటువ్యాధుల బారిన పడకుండా ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలి.
- ప్రతిరోజు వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలి. నిల్వ ఉంచిన వాటిని తినకూడదు.
- సాధ్యమైనంతవరకు కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వర్షాకాలంలో వీలైనంతవరకు మాంసాహారానికి దూరంగా ఉంటే మంచిది. పాత్రలపై ఎల్లప్పుడు మూతలు ఉండేలా చూసుకోవాలి.
- జ్వరం, దగ్గు, తలనొప్పి, వంటినొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల్లోని ఏఎన్ఎంలను సంప్రదించాలి.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి అల్తాఫ్ పేర్కొన్నారు. శుక్రవారం వందనంలో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఇంటింటి సర్వే నిర్వహించి నీటి నిల్వలు తొలగించారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు తబ్సుమ్, హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, రేఛల్‌రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఏఎన్ఎం జయమ్మ, ఆశ కార్యకర్తలు సుజాత, లేయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి..



సీజనల్ వ్యాధులు, పారిశుధ్యంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే సీజనల్ వ్యాధుల బారినుంచి ప్రజలను రక్షించవచ్చు. గ్రామప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి.

– అల్తాఫ్, మండల వైద్యాధికారి, చింతకాని

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి..



వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలి. డ్రెయినేజీల్లో మురుగునీరు నిలిచి దోమలు పెరుగుతున్నాయి. మురుగునీటి నిల్వలపై బ్లీచింగ్ చల్లి ఫాగింగ్ చేయాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండల అధికారులు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– పగడాల అంజయ్య, మత్కేపల్లి

పల్లిపాడులో వ్యవసాయ సదస్సు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

వైరా: వైరా మున్సిపాలిటీ శివారు పల్లిపాడు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అశ్వరావుపేట విద్యార్థులు గ్రామంలోని రైతులతో కలిసి శుక్రవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక వ్యవస్థలో గ్రామాల పాత్ర గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణి, డాక్టర్ పావని, డాక్టర్ చైతన్య, గ్రామ పెద్దలు శ్రీనాథ్‌బాబు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు బిందు, చిట్టి, నీత, ఆనంద్, వర్షిణి, నికిత, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు సీపీఎం

వైరా: స్థానిక సమస్యలపై సీపీఎం ఫోకస్‌పెట్టి ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజల వద్దకే వెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్ తెలిపారు. శుక్రవారం వైరాలో మచ్చా మణి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా పట్టణ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం సంతకాలు సేకరించనున్నట్లు తెలిపారు. నాయకులు చలపతిరావు, సమత, వెంకటేశ్వరరావు, రజిత, సుధాకర్, సాంబశివరావు, మోహనరావు, నరసయ్య, బత్తిరన్న, రామారావు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఏన్కూరు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీఎఫ్ఐ రజతోత్సవాల సందర్భంగా శుక్రవారం పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని, దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఖాళీలను భర్తీ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవరావు, రామ్‌చంద్, మూడ్ పుల్లయ్య, శ్రీదేవి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

బోనకల్: మండల కేంద్రంలో విద్యుత్ శాఖాధికారులు 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. లోవోల్టేజీ సమస్యను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా.. భట్టి ఆదేశాలతో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారావు, చిరునోముల గ్రామశాఖ అధ్యక్షుడు నర్సయ్య శాస్త్రి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బద్రి నాయక్, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

సత్తుపల్లి: వర్షాకాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు ప్రబలకుండా జ్వరాలను అరికట్టేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు కోరారు. శుక్రవారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించి వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి, వైద్య శిబిరాలు, ఫాగింగ్‌విఎషన్ ద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా పిచికారీ చేయాలన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

సత్తుపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీలు, మున్సిపాల్టీలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. వైద్య శిబిరాలు నిర్వహించి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో సూపర్‌వైజర్లు శారారాణి, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: ఎట్టకేలకు తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. 'తాగునీరు కలుషితం..' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ ఏఈ సురేష్ స్పందించారు. మున్సిపల్ సిబ్బంది తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సమస్యను తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్ల, రఘునాధగూడెం గ్రామాలకు శనివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ ఏఈ తెలిపారు. చంద్రుపట్ల గ్రామం వద్ద ఖమ్మం నుంచి దేవరపల్లి వెళ్లే గ్రీన్ ఫీల్డ్ హైవేపై రహదారి వంతెనను దాటుతున్న టవర్ లైన్లో మార్పిడి పని జరుగుతున్నందున 11కేవీ లైన్లకు శనివారం విద్యుత్ ఉండదన్నారు. రఘునాధగూడెం, చంద్రుపట్ల గ్రామాల్లోని గృహాలు, వ్యవసాయ విద్యుత్ త్రీఫేస్ సరఫరాకు గాను రాత్రి 9 గంటల నుంచి సరఫరా చేయటం జరుగుతుందన్నారు.

వినతుల వెల్లువ..

శాతవాహన రైలుకు హాల్టింగ్ కల్పించాలని డీఆర్‌ఎంకు వినతి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం డీఆర్ఎం ఆర్ గోపాలకృష్ణన్‌కు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి హనుమంతరావు, జమలాపురం ఆలయ అర్చకులు వినతిపత్రం అందించారు. తెలంగాణ - ఏపీ రాష్ట్రాల సరిహద్దుగా ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ ఉందని, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేస్తే ఈప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని డీఆర్ఎంకు వివరించారు. శ్రీవారి ప్రసాదాలను డీఆర్ఎంకు అర్చకులు అందచేసి ఆశీర్వచనం చేశారు.

భూ కమిషన్ సభ్యుడికి..

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో 1950, 1960కి పూర్వం జాగీర్దార్ భూములు కొనుగోలు చేసిన ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ సింగరాయపాలెం గ్రామస్తులు శుక్రవారం రాష్ట్ర భూ కమిషన్ సభ్యుడు భూమి సునీల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నరసయ్య, రోషన్ బేగ్, దొడ్డపనేని కృష్ణార్జునరావు, రాంబాబు రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బిల్లులు ఇప్పించాలని ఎంపీడీఓకు..

కల్లూరురూరల్: ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి సంబంధించి బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరుతూ లబ్ధిదారులు కల్లూరు ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. మండల పరిధిలోని తూర్పు లోకవరం, పడమర లోకవరం, కల్లూరు, సంధ్యాతండా, రామానగర్‌లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలకు గత రెండు నెలలుగా బిల్లులు రావడంలేదని, బిల్లులు వచ్చినట్లయితే సకాలంలో గృహ నిర్మాణాలు పూర్తి చేస్తామని లబ్ధిదారులు తెలిపారు. అప్పులు తీసుకొచ్చి ఇంటి నిర్మాణం చేపట్టడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

కోలుకున్న డెంగీ బాధితులు



తల్లాడలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగులు

తల్లాడ: మండల కేంద్రంలోని ఆయుష్ శాఖలో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వర్తించిన కందుల శ్రీదేవి ఇటీవల డెంగీతో మృతి చెందడం, ఆమె బంధువులు ముగ్గురితో పాటు నారాయణపురంలో ఒకరికి డెంగీ పాజిటివ్ రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు వారం రోజులుగా ఫీవర్ సర్వే నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయడంతో పరిస్థితులు కుదుటపడ్డాయి. అంతేకాక డెంగీ బారిన పడిన వారు కోలుకుని ఇళ్లకు చేరడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఫీవర్ సర్వేలో మండల వ్యాప్తంగా 32మందికి వైరల్ జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించి చికిత్స చేస్తున్నారు. ఇదేసమయాన దోమల నివారణకు మందు పిచికారీ చేస్తూ, మురుగునీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వదులుతున్నారు. అయితే, ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే దోమలు దరి చేరవని, తద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని మండల వైద్యాధికారి రత్న మనోహర్ సూచించారు. ఎవరికైనా జ్వర లక్షణాలు ఉంటే పరీక్ష చేయించుకోవాలని తెలిపారు

తల్లిపాలే శ్రేష్ఠం



సత్తుపల్లిటౌన్: కిష్టారంలో మాట్లాడుతున్న సీడీపీఓ మెహరున్నీసా

సత్తుపల్లిటౌన్/ తల్లాడ/ ఏన్కూరు/బోనకల్: తల్లీ, బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్ఠమని ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నీసా, ఏసీడీపీఓ నవ్యశ్రీ, సూపర్‌వైజర్లు రజిని, కె.సత్యావతి, భవాని, రమాదేవి తెలిపారు. సత్తుపల్లి మండలం కిష్టారంలో, తల్లాడలోని బాలపేటలో, ఏన్కూరు అంగన్‌వాడీ కేంద్రంలో, బోనకల్‌లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. మునగాకుతో చేసిన వంటకాలను ప్రదర్శించి గర్భిణులకు, బాలింతలకు అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామారావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

7వరకు తల్లిపాల వారోత్సవాలు

కల్లూరు: కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఈ నెల 7వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ నిర్మల జ్యోతి పేర్కొన్నారు. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండల కార్యాలయాలు, సెక్టార్‌ల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. శుక్రవారం మూడు మండలాల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రణాళిక కార్యక్రమాలను కల్పించినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఫొటోగ్రాఫర్ల యూనియన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో ఫొటోగ్రాఫర్లు

సత్తుపల్లి: ఫొటో, వీడియోగ్రాఫర్ల యూనియన్ సత్తుపల్లి మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నం కనకారావు సమక్షాన ఎన్నిక జరగగా, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బాషా, రాంబాబు ఎన్నికయ్యారు. అలాగే, గౌరవ అధ్యక్షులుగా కల్కి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, సతీష్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, కోశాధికారిగా శ్రీరాంమూర్తి, కార్యవర్గ సభ్యులుగా సౌజన్య సుబ్బారావు, ఫణికుమార్, కృష్ణ, గాంధీ, మురళీ, సురేష్, ప్రభాస్, అన్వర్‌బాషా, నర్సింహారావు ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం అధ్యక్షుడు బాషా మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు, సతీష్, తిరుమలరావు, రఘు, హరేంద్రనాథ్, రాఘవాచార్యులు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

పెనుబల్లి: పులిగుండాల ఏకో టూరిజంలో ప్రాజెక్టులో స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సరియం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పులిగుండాల ఏకో టూరిజంలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల్లో సరిహద్దు గ్రామాల గిరిజనులకు ఉపాధికల్పించి, స్థానిక యువకులకు దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పించాలి.

సంఘీభావ సదస్సును జయప్రదం చేయండి

సత్తుపల్లిటౌన్: ఈ నెల 7న ఖమ్మంలో పాలస్తీన సంఘీభావ శాంతియుత సదస్సును విజయవంతం చేయాలని పాలస్తీన సంఘీభావ జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేష్ కోరారు. శుక్రవారం సత్తుపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద గాజా ప్రజలకు మానవీయ సంఘీభావం ప్రకటించారు. అనంతరం సభ విజయంతం చేయాలని కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జాజిరి శ్రీను, బాల బుచ్చయ్య, కుమారస్వామి, సనందన్‌రావు, కృష్ణ, వేలాద్రి, రఘు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సత్తుపల్లిరూరల్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక పాతబస్టాండ్‌లో ఆటో వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు కొండా రాము అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోకార్మికుల జీవనోపాధి దెబ్బతిందన్నారు. తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రూ.12వేలు సంవత్సరానికి అందించి, స్టాండ్ కోసం స్థలం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజారావు, హకీమ్, పాపారావు, సురేష్, రాంబాబు, రమేష్, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..

పెనుబల్లి: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని టీఎన్‌టీయూసీ ఖమ్మం జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ అధ్యక్షులు కర్రి సదా తెలిపారు. సమస్యలను పరిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

చింతకాని: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని నాగులవంచ, నేరడ గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోయించి నిర్మాణాలను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతగా నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బస్వయ్య, కంభం వీరభద్రం, ముత్తినేని వెంకటేశ్వర్లు, యల్లంపల్లి సతీష్, చిన్నఅప్పారావు, నెల్లూరి రమేష్, ఆలస్యం శంకర్‌రావు, చెవుల తిరుపతిరావు, మంకెన వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజసాయి మందిర నిర్వాహకురాలు మృతి

పెనుబల్లి: మండలంలోని వీ.ఎం.బంజర్ రాజసాయి మందిరం నిర్వాహకురాలు జెన్నారెడ్డి విజయ గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆమె రాజసాయి మందిరం నిర్వహిస్తూనే అన్నదానం, ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు అండగా నిలిచారు. అలాగే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలిగా చురుగ్గా వ్యవహరించారు. ఈమేరకు విజయ మృతదేహం వద్ద కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ నివాళులర్పించి ఆమె భర్త నరసింహారెడ్డి తదితరులను పరామర్శించారు.

పేదల పెన్నిధి 'స్ఫూర్తి ఫౌండేషన్'



ఒక పలక, ఒక బలపం, ఒక పుస్తకం కార్యక్రమానికి పుస్తకాలు, స్టేషనరీ అందిస్తున్న దాతలు(ఫైల్)

కల్లూరు: చదువుకోవాలన్న తపన, ఆసక్తి ఉండి ఉన్నత చదువులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఒక వరంలా మారింది. కల్లూరు పరిసర ప్రాంతాల్లో ఉన్నత చదువులకై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద విద్యార్థులకు సాయమందిస్తున్నారు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్. దీనికి కల్లూరు పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు సేవలు తోడయ్యాయి. సాయంకోసం ఫౌండేషన్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతీ పేద విద్యార్థి కుటుంబ నేపథ్యం, ఆర్థిక స్థితిగతులు పరిశీలించి విషయాన్ని ఫౌండేషన్‌కు తెలిపి సాయమందేలా చేస్తున్నారు. ఈ ఆరు నెలల్లోనే 39మంది పేద విద్యార్థుల ఉన్నత విద్యకై రూ.35లక్షలు అందించడంతో పాటు, పేద విద్యార్థుల మధ్యాహ్న భోజనం, నిరుపేదలకు రగ్గులు, దుప్పట్లు, నిత్యావసరాలు అందించడం, పాలు పాఠశాలలకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం తదితర సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఈ క్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు ప్రవేశ పెట్టిన 'ఒక పలక, ఒక బలపం, ఒక పుస్తకం'కు విశేష స్పందన వస్తుంది. ఇప్పటి వరకు 55మంది దాతలు స్పందించి పుస్తకాలు, పలకలు, బలపాల బాక్సులు, పెన్నులు ఇతర స్టేషనరీ సామగ్రి అందించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్.ఉపేందర్ - 99591 24151 మధిర ఎస్.కె. సైదులు - 90524 34278
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎన్ జయరాజు - 96528 68642